పత్తి రైతుకు నిరాశ

దిగుబడి లేక.. గిట్టుబాటు కాక

- రెబ్బెన మండలంలో వేధిస్తున్న కూలీల కొరత
- పంట ఆశలపై నీళ్లు.. పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు



గోలేటి లో చేలలోనే పత్తిపంట

రెబ్బెన, జనవరి 1: పత్తిసాగు చేసిన రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం అనుకూలించక పత్తిపంట దిగుబడి గణనీయంగా తగ్గింది. రైతన్నలు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు పడకపోవడంతో పంట సాగు చేయడం కొంత ఆలస్యమైంది. కొద్దిపాటి వర్షాలకు సాగు చేసిన పత్తి పంట మొలకెత్తిన తర్వాత వానల జాడ లేకుండా పోవడంతో ఆశించిన స్థాయిలో పత్తి మొక్కకు ఎదుగుదల లేక దిగుబడి తగ్గింది. వ్యవసాయమే జీవనంగా కొనసాగిస్తున్న రైతు ఒక ఏడాది పంట సరిగ్గా పండక పోయినా, మరో ఏడాది పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో సాగుకు సిద్ధమవున్నాడు. పండిన పంటకు సరైన మద్దతు ధర దక్కక పోవడంతో, ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. పత్తి పంట క్వింటాలుకు సీసీఐలో రూ. 7020 చెల్లిస్తుండగా ప్రైవేట్‌గా మాత్రం రూ. 6300 నుంచి రూ. 6700 వరకు చెల్లిస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత..

పంటను తీయడానికి కూలీలు దొరకక పత్తి పంట చేలలోనే దర్శనమిస్తున్నది. కూలీల కొరత ఉండడంతో మహారాష్ట్ర నుంచి వలస కూలీలు వస్తున్నారు. పత్తి ఏరడానికి మొదట కిలోకు రూ. 10 నుంచి రూ.12 తీసుకున్నారు. పత్తి ఏరివేత చివరి దశకు చేరుకోవడంతో రూ.15 నుంచి రూ. 16 ఇస్తామన్నా కూలీలు దొరకడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కూలీలు దొరక్క పోవడంతో రైతులు కుటుంబ సభ్యులతో పత్తి ఏరుతున్నారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేసిన పత్తి పంట చేతికి వచ్చి ఇంటికి రావడానికి రైతులు పడుతున్న కష్టాలు అనేకం.

పత్తి దిగుబడి తగ్గింది..

ప్రతి ఏడాది 10 నుంచి 15 ఎకరాల్లో పత్తి, కంది పంట సాగు చేస్తా. ఈ ఏడాది 12 ఎకరాలలో పత్తి పంట వేసా. సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో పంట దిగుబడి తగ్గింది. పండిన పంటకు మార్కెట్ లో సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి ఖర్చులు మాత్రమే వచ్చాయి. నాలుగు నెలలు పడిన కష్టం లాభాల రూపంలో రాలేదు. చేలలో మిగిలిన పత్తి ఏరుదామంటే కూలీలు దొరకడం లేదు. దీంతో ఇబ్బందులు అయితున్నయ్. ఏం చేయాల్నో అర్థం కావట్లే. పంటంతా చేల్లనే కరాబు అయితదని భయమైతున్నది. ఈ సారి పత్తి ఏసిన రైతులకు నిరాశే మిగిలింది. అప్పులు చేసి, పంట వేసినోళ్లకే కష్టమే అయితది. పత్తికి మరింత గిట్టుబాటు ధర కల్పిస్తే, దిగుబడి తగ్గినా రైతుకు మంచి జరుగుతది.

-లావుధ్య మోహన్‌నాయక్-యువ రైతు-గోలేటి

హక్కుల సాధనే ఐఎన్టీయూసీ ధ్యేయం

దాసుతో ఐఎన్టీయూసీ నాయకులు

రెబ్బెన, జనవరి 1: సింగరేణి కార్మికుల హక్కుల సాధనే ఐ ఎన్టీయూసీ ధ్యేయమని యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీనియర్ నాయకుడు సంగెం ప్రకాశ్ రావు స్పష్టం చేశారు. ఏరియాలోని వర్క్‌షాప్‌లో యాక్టింగ్ ఫోర్ మెన్ దాస్ సోమవారం ఐఎన్టీయూసీలో చేరగా, యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, వర్క్‌షాప్‌లలో కార్మికులను, ఉద్యోగులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా సెక్రెటరీ మాధవకృష్ణ, నాయకులు సంజీవరెడ్డి, మసాడి నారాయణ, రాజేశం, వామన్, అబ్బాస్, రఫీ, రామ్మోహన్, శ్రీనివాస్, తిరుపతి, చారి, గోలెం గట్టయ్య, మెకార్తి మల్లేశ్, ప్రభాకర్ భీమేశ్, కందుల తిరుపతి, సదానందం, లక్ష్మణ్, సత్యనారాయణ కర్రె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

139 శాతం బొగ్గు ఉత్పత్తి

వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన, జనవరి 1: బెల్లంపల్లి ఏరియాలోని గనులు డిసెంబర్ మాసంలో 139 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం రవిప్రసాద్ తెలిపారు. గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసెంబర్ నెలకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు వెల్లడించారు. ఏరియాలోని గనులు డిసెంబర్ మాసంలో 2.75 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 139 శాతంతో 3.83 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. వార్షిక ఉత్పత్తి పరంగా చూస్తే డిసెంబర్ మాసం వరకు 21.75లక్షల టన్నులకు గాను 139 శాతంతో 28.40 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఏరియా లోని గోలేటి ఓసీపీ, ఎంవీకే ఓసీపీ గనుల అనుమతుల కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఏడాది గోలేటి ఓసీపీ ప్రారంభం కోసం తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా కు సంస్థ నిర్దేశించి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సమష్టి కృషితో అధిగమిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవోలు మండల శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులున్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబురాలు

జీఎం రవిప్రసాద్ కు స్వీటు తినిపిస్తున్న కార్యదర్శి తిరుపతి

రెబ్బెన, జనవరి 1: బెల్లంపల్లి ఏరియా లోని వివిధ గనులు, డిపార్టుమెంట్‌లలో సోమవారం కొత్త సంవత్సరం పురస్కరించుకొని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించినట్లు గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం రవిప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించినట్లు పేర్కొన్నారు. ఏరియాలోని కార్మికులు, అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, చంద్రశేఖర్ నాయకులు యుగంధర్, రఘునాథరెడ్డి, సుమద్రాల అనంద్ ఉన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

అక్షింతలను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బెజ్జూర్, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలను ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో భద్రపరిచిన అక్షింతలను ఆలయకమిటీ సభ్యులు, ఆయా గ్రామాల వారు తీసుకెళ్లి గ్రామంలోని ప్రతి ఇంటికీ సరఫరా చేయాలని సోమవారం సూచించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులందరికీ సమాచారం తెలియజేస్తూ భాజా భజంత్రీలతో ప్రతి ఇంటికీ అందజేసేలా గ్రామ కమిటీల వారు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల వారు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మందమర్రి, జనవరి 1 : మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. మందమర్రి ఎస్ఐ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యాపల్ ఏరియాలో జాతీయ రహదారిపై ఎదురెదుగా రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. దీంతో బెల్లంపల్లి పట్టణానికి చెందిన, కేకే ఓసీ క్లర్క్ కోటేశ్, స్థానిక ఇందిరానగర్‌కు చెందిన మహేశ్‌కు గాయాలయ్యాయి. మంచిర్యాల దవాఖానకు తరలించారు. కోటేశ్‌కు తీవ్ర గాయాలవడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురిపై కేసు

జన్నారం, జనవరి 1 : మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన జెల్ల భీమయ్య ఇంటిపై దాడి చేసిన నల్ల విజయ్‌కుమార్, నల్ల వినయ్‌కుమార్, నల్ల కవిత, సింగిడి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి సరళ, సురేఖపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బిక్కులాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం ఈ ఆరుగురు భీమయ్య ఇంటి గేటు పగుల గొట్టి, ఇంట్లోకి చొరబడ్డారు. అతడిపై భార్యపై దాడి చేసి, ఇష్టం వచ్చినట్లు దూషించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

వాంకిడి, జనవరి 1: మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ సాగర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి అయన తన సిబ్బందితో వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే, యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 1: మండలంలో సీసీఐ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఈ నెల 4న కొనుగోళ్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు రోజుల పాటు పత్తి సీసీఐ కేంద్రానికి తేవద్దని కోరారు. గురువారం నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొంటామని తెలిపారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న మేస్త్రీల సంఘం అధ్యక్షుడు నాగోరావ్

సిర్పూర్(యు), జనవరి 1: మండల కేంద్రంలో సోమవారం తాపీ మేస్త్రీల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు గెడాం నాగోరావ్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సంఘం నిర్ణయించిన ధరలకే పనిచేయాలని, ఎక్కువ, తక్కువలు తీసుకోవద్దని అన్నారు. కార్మికుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెల ఒకటో తేదీన నిర్వహించే సంఘం సమావేశానికి తప్పకుండా కార్మికులందరూ హాజరవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆత్రం గంగారం, ఆత్రం కాశీరాం, నైతం జంగు, పీ రాము తదితరులున్నారు.



స్కిల్ సెంటర్ ను ప్రారంభించిన సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్ బాబు

స్కిల్ సెంటర్ ప్రారంభం

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, జనవరి 1: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి కౌశల్ విజ్ఞాన్ యోజనలో భాగంగా స్కిల్ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక్కో స్కిల్ సెంటర్లో తర్ఫీదును పొందే అభ్యర్థి మీద దాదాపు రూ. 20 వేలు ఖర్చు చేస్తుందని, విద్యార్థుందరూ ఈ స్కిల్ సెంటర్‌ను విరివిగా ఉపయోగించుకోవాలని, తద్వారా ఉపాధి పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు రామయ్య, అనిల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రా చారి, గోలెం వెంకటేశ్, ముత్తు అశోక్, పారుపల్లి రాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి నిదర్శనం బోనాలు

దహెగాం,జనవరి 1: ఆచార కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని బోనాల వేడుకలను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. మండలంలో బాబన్‌నగర్ పంచాయతీ పరిధిలోని మేకలగూడ(మన్నెగూడ) గ్రామంలో నిర్వహించిన లక్ష్మీదేవర భీమదేవర, పాండవదేవ బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. లక్ష్మీదేవర, పాండవదేవతలను దర్శించుకొని మొక్కులను చెల్లించారు. అందుకే ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. సకల జనులు సల్లంగా ఉండాలని దేవతలను మొక్కుకున్నట్లు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ కొండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, సర్పంచ్ ఎల్కరి సంజీవ్, నాయకులు కొండ్ర ప్రభాకర్‌గౌడ్, దామోదర్‌గౌడ్, దండెర శంకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ కూతకొస్తున్న క్రీడాకారులు

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

సిర్పూర్(యు) జనవరి 1: మండలంలోని పటేల్‌గూడలో కొడప బాపురావ్ పటేల్ స్మారక కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజులుగా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కొడప గంగారాం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాస్ఫూర్తితో ఆడి పోటీల్లో విజయం సాధించాలన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి 'భీమా కోరేగావ్'

వాంకిడి,జనవరి 1: భీమా కోరేగావ్ సూర్య దావస్ స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తి అని వాంకిడి బౌద్ధ మహర్ అధ్యక్షుడు జైరామ్ ఉప్రే అన్నారు. మండల కేంద్రంలో మహా కోరేగావ్ శౌర్య దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాంకిడి సర్పంచ్ బండే తుకారాం, సంఘం నాయకులు, కుల పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, జనవరి 1: మండల కేంద్రంలోనిల డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నాయకులు పెద్ద ఎత్తున భీమా కోరేగావ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సోన్‌కాంబ్లే సిద్ధార్థ్ మాట్లాడుతూ 206 సంవత్సరాల క్రితం భీమా కోరేగావ్ అనే గ్రామంలో అంటరాని తనంపై పెద్ద ఎత్తున మహార్ సైనికులు పేశ్వా దొరల మధ్య జరిగిన యుద్ధంలో విజయం సాధించిన రోజని పేర్కొన్నారు. ఈ విజయం సాధించినందుకు ఏటా భీమా కోరేగావ్ విజయోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున దళితులు పాల్గొని సామూహిక వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబు కామ్లే, సతీశ్ గైక్వాడ్, కిరణ్ భూతాలే, వెంకటి భూతాలే, నాగోరావు కాంబ్లే, జనార్దన్ సోన్ కాంబ్లే, భానుదాస్, వైభవ్ సోన్ కాంబ్లే, బాబాసాహేబ్ కాంబ్లే, హనుమంతరావ్ వాగ్మారే, దిగంబర్ వాగ్మారే, యువ నాయకులు సత్యవాన్ కాంబ్లే, శ్యామ్ బండారే, నిఖిల్, ఘట్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి:అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉద్యోగోన్నతులు పొందిన వారికి స్టార్ ను వేస్తున్న ఎస్పీ సురేశ్ కుమార్

ఉద్యోగోన్నతులతో మరింత బాధ్యత

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 1: ఉద్యోగోన్నతులతో మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సివిల్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్స్ నుంచి ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన రమేశ్, అనిల్ కుమార్, చంద్రశేఖర్, సాయిబాబా, జమిల్ అహ్మద్, వేణుగోపాల్‌ను సోమవారం ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉద్యోగోన్నతులు పొందిన వారికి స్టార్ ను వేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన వారిలో స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతలను క్రమ శిక్షణతో నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో పోలీసులు గౌరవాన్ని పెంచేలా సేవలందించాలని మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. పోలీసు అధికారులు తదితరులు ఉన్నారు.

కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 1: కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కొత్త సంవత్సర వేడుకలను సోమవారం పోలీసు అధికారులతో కలిసి నిర్వహించారు. కేకు కోసి ఎస్పీ అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత చేరువై సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు ఎం. వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, సీఐలు, ఎస్ఐ లు ఉన్నారు.

కేక్ కోస్తున్న ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్

జీఎం రవిప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాసరావు

హ్యాపీ న్యూఇయర్..

రెబ్బెన, జనవరి 1: రెబ్బెన మండలంలో సోమవారం కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 12 గంటల తర్వాత పటాకులు కాల్చుతూ, కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపగా, గోలేటిలో ఏరియా జీఎం రవిప్రసాద్‌కు వివిధ కార్మిక సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు, యువతులు ఇంటి ముందు ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్‌కు కొత్త సంవత్సరం సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి వెంకయ్య, కమిటీ సభ్యులు దేవేందర్, ఓరం కిరణ్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేమూర్ల సంతోష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, ఎంపీటీసీ దుర్గం రాము, బీఆర్ఎస్ నాయకులు దోమల వెంకన్న, జుమ్మిడి అనందరావు, రవి, మన్యం పద్మ, పద్మ, తదితరులున్నారు.

దహెగాం,జనవరి 1: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి హ్యాపీ న్యూఇయర్ విషెస్ చెప్పుకున్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గని కేక్ కట్‌చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మానేటి రామ్మోహన్, నాయకులు ఎల్కరి బాబాజీ, చప్పిడ సంజీవ్, పడాల సురేశ్, సామెర మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి1: జిల్లా కేంద్రంలోని న్యూ లైఫ్ అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో ఆంగ్ల నూతన సంవత్సర, క్రిస్మస్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి ఫాదర్ ఎంపీపీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, నాయకులు సత్రవేణి మల్లేశ్,చారి తదితరులు ఉన్నారు.

రెబ్బెన: ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్నఎంపీపీ జుమ్మిడి సౌందర్య

కొత్త ఉత్సాహంతో ప్రగతికి తోడ్పడాలి

- మందమర్రి జీఎం మనోహర్

మందమర్రి, జనవరి 1 : నూతన సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో మరింత కృషి చేసి, సింగరేణి సంస్థ ప్రగతికి తోడ్పడాలని మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ అధికారులు, కార్మికులకు సూచించారు. ఏరియా జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులందరికీ తల్లిలాంటిదన్నారు. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని పేర్కొన్నారు. సింగరేణి కేవలం ఉద్యోగుల సంక్షేమానికే కాకుండా పరిసర గ్రామాల అభివృద్ధికీ దోహదపడుతుందన్నారు. అలాగే వివిధ విభాగాలోల ఉచిత శిక్షణ ఇస్తూ నిరుద్యోగులు, వృత్తి శిక్షణ కోర్సులతో మహిళలకు అండగా ఉంటున్నదని తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సంస్థ ప్రగతికి పాటుపడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి రవీందర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఫారెస్ట్ మేనేజర్ రమణారెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ బందోపాధ్యాయ, ఎస్టేట్ ఆఫీసర్ కుమారస్వామి, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.